ఆరిలోవవాసుల కల.. తీరనున్న వేళ

ఆరిలోవ ప్రజల సౌలభ్యం కోసం స్థానికంగా సకల సదుపాయాలతో చక్కటి కల్యాణ మండపం నిర్మాణానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి నడుం బిగించారు. ఇందుకు సంబంధించి ఆమె ఇప్పటికే భూమిపూజ చేశారు. ఇక్కడ కల్యాణ మండపం నిర్మాణమైతే ఆరిలోవ కాలనీ నుంచి టీఐసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్‌తో పాటు కొండవాలు ప్రాంతాలైన పెదగదిలి, చినగదిలి ప్రాంతీయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు చేసుకోవటానికి వారంతా దూర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఇప్పుడు ఇక్కడ కల్యాణ మండపం నిర్మాణమైతే తమకు వెసులుబాటుగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, మేయర్‌కు కృతజ్ఞతలు చెబుతున్నారు.



బాలాజీనగర్‌లో కల్యాణ మండపం నిర్మించనున్న స్థలం



నిర్మాణ పనుల కోసం భూమిపూజ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి (ఫైల్)

- రూ.6 కోట్లతో కల్యాణ మండపానికి జీవీఎంసీ శ్రీకారం
- భూమిపూజ చేసిన మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ : స్థానికులకు ఆధునిక కల్యాణ మండపం అందుబాటులోకి రానుంది. విశాలమైన ఖాళీ స్థలంలో రూ.కోట్ల నిధులతో ఇక్కడ కల్యాణ మండపం నిర్మించనున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 11వ వార్డు పరిధి బాలాజీనగర్ దరి పాత ఆరిలోవలో సుమారు ఎకరం స్థలంలో 35 సంవత్సరాల క్రితం జీవీఎంసీ కల్యాణ మండపం నిర్మించింది. ఆరిలోవ కాలనీ నుంచి బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్ ప్రాంతాల వరకు ఇక్కడే ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునే వారు. అప్పట్లో ఈ ప్రాంతంలో నివాసాలు తక్కువగా ఉండటం, తక్కువ జనాభా కావటంతో ఇది సరిపోయేది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో నివాసాల సంఖ్యతో పాటు జనాభా విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం వారి అవసరాలకు ఇది సరిపోవడంలేదు. సరికదా కల్యాణ మండపం శిథిలావస్థకు చేరింది. భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదం జరగకుండా జీవీఎంసీ అధికారులు దీన్ని ఇటీవల పూర్తిగా నేలమట్టం చేశారు. కొత్తగా కల్యాణ మండపం నిర్మించదలిచారు.

అవసరాలకు అనుగుణంగా..

ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అదే స్థలంలో ఆధునిక కల్యాణ మండపం నిర్మించాలని సంకల్పించారు. దీంతో జీవీఎంసీ అధికారులతో చర్చించి నిధులు కేటాయించారు. ఇక్కడ సుమారు ఎకరం విస్తర్ణంలో ఉన్న ఆ స్థలంలోనే ఆధునిక కల్యాణ మండపం నిర్మించదలిచారు. దీని కోసం రూ.6 కోట్ల నిధులు కేటాయించారు. దీని నిర్మాణం కోసం ఈనెల 11న మేయర్ హరి వెంకటకుమారి స్థానిక పెద్దలు, జోన్–2 అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఇక్కడ జి+2 నిర్మాణం చేపట్టనున్నారు. దీని సెల్లార్‌ను వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తారు. గ్రౌండ్, మొదటి అంతస్తులు డైనింగ్ కోసం, రెండో అంతస్తు వేదిక కోసం వినియోగించే విధంగా నిర్మాణం చేపడుతున్నారు. దీని నిర్మాణం పూర్తయితే ఆరిలోవ కాలనీ నుంచి టీఐసీ పాయింట్, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్‌తో పాటు కొండవాలు ప్రాంతాలైన పెదగదిలి, చినగదిలి ప్రాంతాల ప్రజలకు సైతం ఇది అందుబాటులో ఉంటుంది.

ఇక్కడి ప్రజల అవసరం మేరకు నిర్మాణం..



ఆరిలోవ ప్రాంతంలో పేద ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారు. వారి అవసరాలకు అనుగుణంగా ఇక్కడ విశాలమైన కల్యాణ మండపం అవసరం. అందుకే దీని నిర్మాణం చేపడుతున్నాం. పటిష్టమైన నిర్మాణం కోసం కైలాసగిరిని నిర్మించిన అనుభవజ్ఞుడైన కాంట్రాక్టర్‌కు దీని పనులు అప్పగించాం. దీన్ని తొమ్మిది నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తాం. ఇక్కడి వారికి ఇది చక్కటి కానుకలాంటిది.

–గొలగాని హరివెంకటకుమారి, నగర మేయర్

స్థానికులకు ఎంతో ఉపయోగకరం

ఆరిలోవ ప్రాంతంలో పెద్ద కల్యాణ మండపం అవసరం. కొన్నేళ్లుగా ఇక్కడ జనాభా పెరిగింది. ప్రస్తుతం వివాహాది శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టడానికి దూర ప్రాంతాల్లో ఉన్న కల్యాణ మండపాలకు వెళ్తున్నాం. ఈ కల్యాణ మండపం అందుబాటులోకి వస్తే ఇక్కడి ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది. ఈ నిర్మాణం కోసం కృషి చేసిన మేయర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

–కె.దాలినాయుడు, బాలాజీనగర్

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఇంత వరకు ఆరిలోవ ప్రాంతాన్ని ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదు. ఇక్కడ చిన్నచిన్న రోడ్లు, కాలువలు నిర్మించి వదిలేశారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా శాశ్వతమైన కల్యాణ మండపం నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, నగర మేయర్‌గా స్థానికురాలు ఉండటంతో ఈ కల్యాణ మండపం నిర్మాణం జరుగుతోంది. ప్రభుత్వానికి, మేయర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు, బాలాజీనగర్

క్లుప్తంగా

ఓటరు సర్వేను పర్యవేక్షించిన జేసీ



ఆరిలోవలో ఓ గృహిణితో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

ఆరిలోవ : స్థానికంగా జరుగుతున్న ఓటర్ల పరిశీలనలో శనివారం జాయింట్ కలెక్టర్ కె.విశ్వనాథన్ పాల్గొన్నారు. జీవీఎంసీ 12వ వార్డు పరిధి 31వ బూత్ బీసీ కాలనీలో ఓటర్ల పరిశీలనను ఆయన పర్యవేక్షించారు. నేరుగా ఓటర్లతో ఆయన మాట్లాడి వారి జాబితాలను తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సరిగా చూసుకుని ఓటర్లకు ఎలాంటి సమస్య తలెత్తకుండా పరిశీలన చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి, రూరల్ రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడితో సొసైటీ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలో శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–7లోని ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్ ఎదురుగా నిర్వహించిన శిబిరంలో యువత పాల్గొని, 25 యూనిట్లు పైగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ లైఫ్ మెంబర్ పి.రాంబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. యువతతో పాటు స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్, డాక్టర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కోలా గురువులుకు సత్కారం



కోలా గురువులును సత్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మడి దాసు జన్మదినోత్సవం సందర్భంగా శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జోడుగుళ్లపాలెంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, తూర్పు ఎన్నికల పరిశీలకుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు హాజరై పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి స్వాతితో కలిసి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులును, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలను గజమాలలతో ఘనంగా సత్కరించారు. వార్డులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పంచెలు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, గొలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజబాబు, పేర్ల విజయచందర్, స్థానిక నాయకులు మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, కళావతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన టమాటా ధర

సీతమ్మధార: నగరంలోని రైతుబజార్లలో టమాటా ధర తగ్గింది. శనివారం సీతమ్మధార రైతుబజార్‌లో కిలో టమాటా రూ.60కు విక్రయించారు. ఒక్కరోజులో సుమారు రూ.18 తగ్గిండంతో వినియోదారులు రైతుబజార్‌కు పోటెత్తారు. సోమవారం నాటికి టమాటా మరింత తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

ఫిష్‌మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



కోలా గురువులును అభినందిస్తున్న మత్స్యకార సంఘాల నాయకులు

మహారాణిపేట : ఆరిలోవలో ఫిష్‌మార్కెట్ యార్డ్ నిర్మాణానికి మార్గం సుగమం అయింది. మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు చొరవతో నిర్మాణం చేపట్టేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు రూ. 10 లక్షలు మంజూరు చేసింది. దీంతో ఆరిలోవలో సుమారు 40 షాపులు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తమ దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి కోలా గురువులు చేసిన కృషికి స్థానిక మత్స్యకారులు, మత్స్యకార సంఘ నాయకులు మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో శనివారం కోలా గురువులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గురువులును అభినందించిన వారిలో సిటీ మత్స్యకార సంఘం అధ్యక్షుడు కొక్కిలి గెడ్డ రాజా వర్మ, శాంతినగర్ మత్స్యకార నాయకులు వాసుపల్లి అప్పన్న, గాంధీనగర్ మత్స్యకార నాయకులు రాగతి అచ్యుతరావు, నేషనల్ ఫిషరీస్ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులు కొక్కిలిగెడ్డ వెంకటేశ్వరరావు ఉన్నారు.

అలరించిన బుర్రకథ



బుర్రకథ వినిపిస్తున్న కళాకారులు

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం బుర్రకథ ఆహూతులను అలరించింది. ముందుగా వీఎండీఏ చైర్మన్ మంతెన సత్యనారాయణ, మస్తాన్‌రెడ్డి జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం తాడేపల్లి గూడెంకు చెందిన కళాకారులు సాయిరాం బృందం శ్రీకృష్ణ రాయబారం బుర్రకథను ప్రదర్శించింది. మిరియాల వెంకటేశ్వరరావు, మిరియాల సత్యనారాయణ, మిరియాల సాయిరాం ఆద్యంతం తమ బుర్రకథా గానంతో ఆకట్టుకున్నారు.

'సకల కళాకారుల' నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉప అధ్యక్షుడిగా జె.ఎం.ఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్‌సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రీ శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతో పాటు మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏకపాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రీ, డోనాల్డ్ డక్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కొరిటాల ప్రభాకర్, ఎం.వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత మన సంప్రదాయానికి ప్రతీక



హ్యాండ్లూమ్ వాక్‌లో పాల్గొన్న బీజేపీ మహిళా కార్యకర్తలు

ఎంవీపీకాలనీ: చేనేత భారతీయ సంస్కృతిలో భాగమని బీజేపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ప్రేమకుమారి అన్నారు. మహిళలు చేనేత వస్త్రాలను వినియోగించి కార్మికులను ప్రోత్సహించాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన హ్యాండ్లూమ్ వాక్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపై నేటి యువతరానికి అవగాహన కల్పించాలన్నారు. చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా దేశంలోని చేనేత కార్మికులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి రోహిణి, జిల్లా కల్చరల్ సెల్ కన్వీనర్ జవ్వాది లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, కార్యదర్శి చల్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయనీమణులు

ఎంవీపీకాలనీ : శ్రీ వేంకటేశ్వరస్వామి వారి శ్రావణ సంగీతోత్సవాల్లో భాగంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీతోత్సవాలు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నగరంలోని మ్యూజిక్, డాన్స్ అకాడమీలకు చెందిన యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ 13వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు చిన్నారులకు భక్తిగీతాలు, భగవద్గీత శ్లోకాలు, రామాయణం, భారతం, డ్రాయింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చన్నారు.

ఏయూ సమాచారం

అన్నదాత కష్టం ప్రతీ వ్యక్తి తెలుసుకోవాలి

- రైతులకు కృతజ్ఞత తెలపడం కనీస ధర్మం
- 'మిషన్ కర్షకదేవోభవ' చైర్మన్ కిషోర్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న కిషోర్ కుమార్

ఏయూక్యాంపస్: మానవజాతి మనుగడకు అవసరమైన ఆహారాన్ని పండించి అందిస్తున్న రైతుల విలువను ప్రతీ వ్యక్తి తెలుసుకోవాలని మిషన్ కర్షకదేవోభవ చైర్మన్ ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. మిషన్ కర్షకదేవోభవలో భాగంగా 15వ రోజు శనివారం ఏయూ మైదానంలోని బోధిధర్మ యుద్ధ కళాక్షేత్ర శిక్షణ శిబిరంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రజలకు అవసరమైన ఆహారాన్ని పండించి అందరి ఆకలిని తీరుస్తున్న అన్నదాతలు మాత్రం ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల నుంచి వస్తువులు కొనుగోలు చేసే సమయంలో ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. ఎంతో శ్రమపడితే గానీ రైతులు ఆహార పదార్థాలను పండించడం సాధ్యపడదనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యలో రాణించడానికి యువత ఎంత కష్టపడతారో, దానికంటే మిన్నగా రైతు ఒక పంటను పండించడానికి శ్రమిస్తాడన్నారు. కొన్ని సందర్భాలలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలియజేశారు. రైతులకు ప్రతీ ఆర్టీసీ బస్సులో ఒక సీటును కేటాయించాలని కోరారు. రైతులకు కృతజ్ఞత తెలపడం, రైతులను గౌరవించడం మన కనీస ధర్మంగా పాటించాలని సూచించారు. రైతు కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారులను అభినందించారు. భవిష్యత్తులో యువత సైతం వ్యవసాయం చేయడానికి ఆసక్తి కనబరచాలని సూచించారు.

ఖాదర్‌బాబాకు అభినందనలు

ఏయూక్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్‌గా ఏయూ ఉద్యోగి షేక్ ఖాదర్ బాబా ఎన్నిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఖాదర్ బాబా ప్రస్తుతం ఏయూ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా, ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఏపీ జీఈఎఫ్ విశాఖ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జీఎం నాయుడు, సుదర్శన్ పట్నాయక్, కో–కన్వీనర్ డాక్టర్ నరేంద్రకుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దంతేశ్వరరావుకు డాక్టరేట్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థి వి.దంతేశ్వర రావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు పేటేటి ప్రేమానందం పర్యవేక్షణలో 'పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది రూరల్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ – ఏ కేస్ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ మండల్స్ ఇన్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు.

15న స్వాతంత్య్ర సమరయోధుల వారసులకు సత్కారాలు

సీతమ్మధార: దేశ 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వందే విశ్వభారత్ వీర పురస్కార్ పేరిట స్వాతంత్య్ర సమరయోధుల వారసులను సత్కరించనున్నట్లు సంస్థ చైర్మన్ బలివాడ రమేష్, ఎండీ భీమరశెట్టి వాసుదేవ్ తెలిపారు. సీతమ్మధార ఏఎస్సార్ నగర్‌లోని కార్యాలయంలో శనివారం మీడియాతో వారు మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ ఎదురుగా ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 120 మంది స్వాతంత్య్ర సమరయోధుల వారసులను వేదికపై సన్మానిస్తామన్నారు. 300 అడుగుల జాతీయ జెండాతో బీచ్ రోడ్డులో ఫ్లాగ్ మార్చ్ జరుగుతుందని, యువత, విద్యార్థులతోపాటు నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రచయిత్రి డాక్టర్ జలాది విజయ, సుశీల, కిశోర్, విజయరమణి, లంక రమ్య, రాధ పాల్గొన్నారు.

గ్రంథాలయశాస్త్ర పితామహుడికి నివాళి



ఏయూలో రంగనాథన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు తదితరులు

ఏయూక్యాంపస్: గ్రంథాలయశాస్త్ర పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ 131వ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయంలో రంగనాథన్ విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రంథాలయ శాస్త్రానికి ఒక గుర్తింపు, రూపురేఖలు తీసుకొచ్చిన ఆయన కృషి ఎనలేనిదన్నారు. సంప్రదాయ గ్రంథాలయాల నుంచి నేటి డిజిటల్ లైబ్రరీ వరకు జరిగిన విస్తృతి, ప్రగతిని వివరించారు. భవిష్యత్ తరాలను గ్రంథాలయం దిశగా నడిపించే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి బి.రాజగోపాల్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథపాలకుల దినోత్సవం



కృష్ణా కళాశాలలో ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాలలో గ్రంథ పాలకుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని సముపార్జించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానికులకే ఎంపీ సీటు కేటాయించాలి

సీతంపేట: ఏ రాజకీయ పార్టీ అయినా స్థానికులకే ఎంపీ అభ్యర్థి సీటు కేటాయించాలని మాజీ వీసీ, యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎవరు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇప్పటి వరకు 20 లక్షల కోట్ల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని, బయట నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులే ఈ పని చేశారని ఆరోపించారు. 1991 నుంచి స్థానికేతరులే విశాఖ ఎంపీగా ఎన్నికవుతున్నారని తెలిపారు. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ స్థానిక నాయకులు లేక ఇక్కడి సమస్యలపై ఎవరిని సంప్రదించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుల అవసరముందని, లేదంటే భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రొఫెసర్ అల్లు గౌరీశంకర్ మాట్లాడుతూ రెండు సామాజిక వర్గాలే రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, స్థానికేతరులు దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నారే తప్ప.. ఇక్కడి ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు, మాజీ జిల్లా జడ్జిలు పి.ముత్యాలనాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అరసం కార్యదర్శి అప్పలరాజు, సామాజిక ఉద్యమకారుడు ఎస్.వి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.